
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

TELTEL/2022/83842
PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 10, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :205 | పేజీలు :4 | వెల. 3/-




"ప్రభుత్వం పేదవాడి ఆకలి కేకలు తీర్చడానికి కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తూ, రూపాయికే కిలో బియ్యం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు 'గిజిగాళ్ల' ధన దాహానికి ఆ లక్ష్యం కాస్తా నీరుగారిపోతోంది. కేసముద్రం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆ గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ఒక వ్యక్తిగత వ్యాపార సామ్రాజ్యంగా మారిపోయింది. అక్కడ డీలర్ మాటే శాసనం.. అక్రమమే అతని నినాదం! రేషన్ బియ్యం అక్రమ రవాణాలో తనకంటూ ఒక 'కిలాడీ' మార్కును సృష్టించుకున్న సదరు డీలర్, నిరుపేదల నోటికాడ ముద్దను లాగేస్తూ కోట్లు గడిస్తున్నాడు. తూకంలో తరుగు చూపిస్తూ ఒకవైపు, పేదల వద్ద తక్కువ ధరకే బియ్యం కొని బయట మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ మరోవైపు.. ఇలా రెండు చేతులా దోపిడీ సాగిస్తున్నాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'నన్ను అడిగే మొనగాడు లేడు.. అధికారులు నా జేబులో ఉన్నారు' అనే అహంకార పూరిత వ్యాఖ్యలతో లబ్దిదారులపై విరుచుకుపడుతున్నాడు. రాజకీయ అండదండలో లేక ఉన్నతాధికారుల ఉదాసీనతో తెలియదు కానీ, సదరు డీలర్ సాగిస్తున్న ఈ 'శ్వేత దందా' ఇప్పుడు మండలవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సదరు రేషన్ డీలర్ పై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

— హైదరాబాద్, ప్రభాత గమనం

# పేదల బియ్యం..
# డీలర్ పాలు!

## కేసముద్రం మండలంలో 'రేషన్' మాఫియా

- తూకంలో భారీ కోత..
- కిలో బియ్యం రూ.10కి కొని బ్లాక్ లో రూ.20కి విక్రయం
- ప్రశ్నిస్తే లబ్ధిదారులపై తిట్ల పురాణం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం!

2

రోడ్డు ప్రమాదాల నివారణకు
## చర్యలు చేపట్టాలి
మానుకోట కలెక్టర్ స్నేహ శబరీష్



2



- అంగన్వాడీల బలోపేతానికి మొబైల్ ఫోన్ల పంపిణీ
- మంత్రి సీతక్క

దళారులను నమ్మి మోసపోవద్దు

వయోవృద్ధులు, స్త్రీ-శిశు సంక్షేమానికి
## ప్రత్యేక చర్యలు

3

## రోడ్డు భద్రతపై వారాంత ప్రత్యేక కార్యక్రమాలు
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ 4

చారిత్రక ప్రాధాన్యం కలిగిన డోర్నకల్ రైల్వే జంక్షన్ త్వరలోనే సరికొత్త రూపురేఖలను సంతరించుకోబోతోంది. నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే (NGSR) కాలంలో నిర్మితమైన ఈ స్టేషన్, దశాబ్దాలుగా దక్షిణ భారతదేశంలో కీలక రైల్వే కూడలిగా సేవలందిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అత్యున్నత ప్రమాణాలతో దీని అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2024లోనే సిద్ధమై, ప్రస్తుతం నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. 2026 చివరి నాటికి ఈ స్టేషన్ పూర్తిస్థాయిలో ఆధునీకరించబడి ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఈ ప్రాజెక్టు కింద స్టేషన్ భవనాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు.

ఆధునిక హంగులతో
# డోర్నకల్ రైల్వే జంక్షన్




3

శుక్రవారం
10.04.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక




# పేదల బియ్యం.. డీలర్ పాలు!

## కేసముద్రం మండలంలో 'రేషన్' మాఫియా

- తూకంలో భారీ కోత..
- కిలో బియ్యం రూ.10కి కొని బ్లాక్ లో రూ.20కి విక్రయం
- ప్రశ్నిస్తే లబ్ధిదారులపై తిట్ల పురాణం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం!

**హైదరాబాద్ ప్రభాత గమనం :**

ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) లక్ష్యం నీరుగారిపోతోంది. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం, ఒక అక్రమ వ్యాపారి జేబులు నింపుతోంది. కేసముద్రం మండలంలోని ఒక గ్రామంలో డీలర్ తీరు ఇప్పుడు స్థానికంగా కలకలం రేపుతోంది. అక్రమ రవాణాలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని అలవర్చుకున్న ఈ 'కిలాడీ' డీలర్, నిరుపేదల నోటికాడ ముద్దను లాగేసుకుంటూ, ఎదురు ప్రశ్నించిన వారిపై ప్రతాపం చూపిస్తున్నాడు. మండలంలోని మేజర్ గ్రామంలో మూడు రేషన్ షాపులు ఉన్నాయి. అందులో ఒక రేషన్ డీలర్ రూటే సెపరేట్. చూడటానికి నాకేం ఉన్నాయి. నేనేమి సంపాదించాను అని మాట్లాడుతూనే చేసేదంతా చేస్తున్నాడని లబ్ధిదారులు వాపోతున్నారు. పైకి నీతులు చెప్పే అతని అక్రమ వ్యాపారం అంతా ఇంతా కాదని చెప్పుకోస్తున్నారు.

### ఇదేంటని అడిగితే బెదిరింపులు..

సాధారణంగా రేషన్ డీలర్లు లబ్ధిదారులతో వినయంగా ఉండాలి. కానీ ఇక్కడ సీన్ రివర్స్. ప్రతి కార్డుదారుడికి అందాల్సిన బియ్యంలో సుమారు 2 నుండి 3 కిలోల వరకు కోత విధిస్తున్నాడు. వెయిట్ మిషన్ వద్ద మోసం చేస్తూ, తక్కువ ఇచ్చినా సరే కార్డులో మాత్రం పూర్తి స్థాయిలో నమోదు చేస్తున్నాడు. ఇదేమిటని అడిగితే, "తీసుకుంటే తీసుకో లేకపోతే వెళ్ళిపో" అంటూ లబ్ధిదారులపై విరుచుకుపడుతున్నాడు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలి. కానీ ఈ డీలర్ రూటే సపరేట్. బియ్యం అవసరం లేని పేదల వద్ద నుండి కేవలం రూ.10లకే కిలో బియ్యం సేకరిస్తున్నాడు. అదే బియ్యాన్ని అవసరమున్న వారికి లేదా బయట మార్కెట్లో రూ.20లకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నాడు. ఆయన దౌర్జన్యానికి భయపడి చాలామంది నోరు మెదపడం లేదు.

### అధికారుల నిర్లక్ష్యం

గతంలో ఈయన అక్రమాలపై విసిగిపోయిన స్థానికులు ఏకంగా కరపత్రాలు ముద్రించి పంచినా, డీలర్ తీరులో మార్పు రాలేదు. "అధికారులు నా చుట్టాలే, వారికి అంతా తెలుసు.. నాపై ఫిర్యాదు చేసినా ఏమీ కాదు" అంటూ ప్రగల్భాలు పలుకుతుండటం గ మనార్హం. అధికారుల తనిఖీలు కేవలం నామమాత్రంగానే ఉంటున్నాయని, అందుకే సదరు డీల ర్ రెచ్చిపోతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### చర్యలు తీసుకునేది ఎన్నడో?

బియ్యం పంపిణీ కోసం కేవలం రెండు మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటూ, మూడు నెలలు తీసుకోకపోతే కార్డు రద్దు అవుతుందని హుకుం జారీ చేస్తున్న ఈ డీలర్‌పై సివిల్ సప్లై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండలం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్ల లైసెన్స్ రద్దు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



# నద్దునూరి సమ్మయ్య సేవలు మరువలేనివి

- సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్
- సీపీఐ ఆధ్వర్యంలో సమ్మయ్య 20వ వర్ధంతి సభ

కేసముద్రం, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం): ప్రజా ఉద్యమాల్లో, సిపిఐలో అమరజీవి కామ్రేడ్ నద్దునూరి సమ్మయ్య చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం కమ్యూనిటీ హాల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో సమ్మయ్య 20వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో చొప్పరి శేఖర్, ఎన్.ఎ. స్టాలిన్, వెల్పుగొండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు కొమురయ్య, వెల్పుగొండ ఏలీయా తదితరులు ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చొప్పరి శేఖర్ మాట్లాడుతూ, సమ్మయ్య జీవితం మొత్తం ప్రజా సమస్యల పరిష్కారానికే అంకితమైందని తెలిపారు. కేసముద్రం మండలంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మహోన్నత వ్యక్తి సమ్మయ్య అని కొనియాడారు. అమీనాపురం ప్రాంతంలో సిపిఐ ఉద్యమ నిర్మాణానికి సమ్మయ్య చేసిన సేవలు విశేషమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని పేర్కొన్నారు. ఇతర వక్తలు మాట్లాడుతూ, అమీనాపురం ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ స్థలాన్ని రక్షించేందుకు సమ్మయ్య చేసిన పోరాటం ఆదర్శప్రాయమని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్, సిపిఐ నాయకులు మంద భాస్కర్, కాసు సాయి, గ్రామ పెద్దలు వెల్పుగొండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు కొమురయ్య, దండు సురేందర్, అంబేద్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెల్పుగొండ ఏలీయా, కట్కూరి ప్రేమ్ కుమార్, జన్ను శ్రీను, దండు బాబు, జన్ను చంటి, ముల్లి శివ, సమ్మయ్య కుటుంబ సభ్యులు నద్దునూరి వెంకటమ్మ, నద్దునూరి సారంగం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



### మానుకోట జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, జాతీయ రహదారులు, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో రహదారి భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ కూడా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో ఇచ్చిన సూచనలు ఎంతవరకు అమలు చేశారో అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాల్లో తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. అనవసర యూ-టర్న్‌లను తగ్గించడంతో పాటు రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలను కట్టడి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ప్రమాదాలు తగ్గించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలపై ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. వచ్చే కమిటీ సమావేశం నాటికి పనులు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సులను తప్పనిసరిగా తనిఖీ చేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో రోడ్ ఇన్‌స్పెక్షన్ బృందాన్ని ఏర్పాటు చేసి, భద్రతా చర్యల అమలును పర్యవేక్షించాలని సూచించారు. అలాగే గ్రామ స్థాయిలో రహదారి భద్రత కమిటీలను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.
జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధిక లోడుతో ప్రయాణించే ఆటోలు, బైక్‌లపై ముగ్గురు ప్రయాణించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రముఖులతో కలిసి రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్, అడిషనల్ ఎస్పీ తిరుపతి రావు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10.04.2026
www.prabhatagamanam.com






# ఆధునిక హంగులతో డోర్నకల్ రైల్వే జంక్షన్

**డోర్నకల్, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం):**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన డోర్నకల్ రైల్వే జంక్షన్ త్వరలోనే సరికొత్త రూపురేఖలను సంతరించుకోబోతోంది. నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే (NGSR) కాలంలో నిర్మితమైన ఈ స్టేషన్, దశాబ్దాలుగా దక్షిణ భారతదేశంలో కీలక రైల్వే కూడలిగా సేవలందిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అత్యున్నత ప్రమాణాలతో దీని అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2024లోనే సిద్ధమై, ప్రస్తుతం నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. 2026 చివరి నాటికి ఈ స్టేషన్ పూర్తిస్థాయిలో ఆధునీకరించబడి ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఈ ప్రాజెక్టు కింద స్టేషన్ భవనాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు.

### రూ..320 కోట్ల వ్యయంతో నిర్మాణం

సుమారు రూ.320 కోట్ల అంచనా వ్యయంతో 10.5 కిలోమీటర్ల మేర 'రైల్ ఓవర్ రైల్' నిర్మాణానికి ఆమోదం లభించింది. దీని వల్ల విజయవాడ–కాజీపేట మార్గంలో రైళ్ల క్రాసింగ్ సమస్య తగ్గి, ప్రయాణ వేగం పెరగనుంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ప్లాట్‌ఫారాలు, లూప్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక వెయిటింగ్ హాల్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, డిజిటల్ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయబడుతున్నాయి. అలాగే స్టేషన్‌లో ఉన్న తాగునీటి వసతులను పునరుద్ధరిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భౌగోళికంగా కీలక స్థానంలో ఉన్న డోర్నకల్ జంక్షన్, భవిష్యత్తులో భద్రాచలం మరియు ప్రతిపాదిత గద్వాల్ లైన్లకు ప్రధాన కేంద్రంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. "పనులు పూర్తయ్యాక డోర్నకల్ రైల్వే స్టేషన్ కార్పొరేట్ విమానాశ్రయాన్ని తలపించేలా ఉంటుంది" అని రైల్వే వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పాత స్టేషన్ రూపం త్వరలో మారిపోగా, 2026 చివరి నాటికి అభివృద్ధి చెందిన డోర్నకల్‌ను చూసి స్థానికులు గర్వపడేలా రైల్వే శాఖ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.



# అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠా అరెస్ట్

ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో:
ములుగు జిల్లా వాజేడు మండలంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. తెల్లవారుజామున పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో వాజేడు ఎస్సై సతీష్ తన సిబ్బందితో కలిసి మండపాక గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుర్తుతెలియని వ్యక్తులు బొలెరో వాహనాలలో సుమారు 32 పశువులను నిర్బంధించి తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన వారిని విచారించిన అనంతరం వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న పశువులను భూపాలపల్లి జిల్లా రాంపూర్ గ్రామంలోని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ, పశువులను అక్రమంగా నిర్బంధించి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు..

- మంత్రి సీతక్క
- సీతంపేటలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



గార్ల, ప్రభాతగమనం :
రైతులు దళారుల మాయమాటలు నమ్మి తక్కువ ధరకు పంటను అమ్ముకుని మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నను విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రి సీతక్క సూచించారు. గురువారం గార్ల మండలం సీతంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకోకుండా, ప్రభుత్వ కేంద్రాల ద్వారా లభించే కనీస మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.




# వయోవృద్ధులు, స్త్రీ-శిశు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- అంగన్వాడి సేవల బలోపేతానికి మొబైల్ ఫోన్ల పంపిణీ
- మంత్రి సీతక్క

మహబూబాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం):
దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వయోవృద్ధులు, స్త్రీలు, శిశువులు, మాతృమూర్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క తెలిపారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను ప్రారంభించి, అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిర్వహించే పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి లతో కలిసి ప్రారంభించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్లు వారి ఒంటరితనాన్ని తొలగించి ఆనందంగా గడిపే వేదికలుగా ఉపయోగపడతాయని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు వృద్ధులు వివిధ క్రీడల్లో పాల్గొని మానసిక ప్రశాంతతను పొందేలా ఈ కేంద్రాన్ని రూపొందించామని తెలిపారు. జిల్లాలో సుమారు ₹12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా ప్రేమగా చూసుకోవాలని, వారిని నిరాశ్రయులుగా వదిలేయడం తగదని సూచించారు. ఈ కేంద్రంలో టీవీ, పత్రికలు, మ్యాగజీన్లు, క్యారమ్స్, చెస్ వంటి వినోద, క్రీడా సదుపాయాలతో పాటు ఆరోగ్య సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి వారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని చెప్పారు.

### అంగన్వాడీ టీచర్లకు ఫోన్లు పంపిణీ

అంగన్వాడి సేవల బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని, వీటి ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, పోషకాహార పంపిణీ వివరాలు డిజిటల్ రూపంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.పోషణ్ పక్వాడ కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 23 వరకు కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు.
మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వృద్ధుల సంక్షేమానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని అభినందించారు. డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారి సబిత, సిడిపిఓలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం
10.04.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# రోడ్డు భద్రతపై వారాంత ప్రత్యేక కార్యక్రమాలు

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో వారాంత ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ శివధర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న అనంతరం, "ఆరైవ్ అలైవ్" కార్యక్రమం కింద ఏప్రిల్ 13 నుండి 18 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని వెల్లడించారు.




**కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి:**

**మొదటి రోజు:** గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, సభ్యులతో ప్రమాణ స్వీకారం.

**రెండవ రోజు:** డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలతో ప్రమాణం చేయించడం, ప్రమాదకర కూడళ్ల గుర్తింపు.

**మూడవ రోజు:** బాలల రోడ్డు భద్రత దినోత్సవంగా నిర్వహించి, విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన.

**నాలుగో రోజు:** సోషల్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు, డ్రైవర్లపై ప్రత్యేక తనిఖీలు.

**ఐదవ రోజు:** గోల్డెన్ అవర్ స్పందనపై శిక్షణ, ప్రమాద సమయంలో ప్రాణరక్షణ పద్ధతులపై అవగాహన.

**ఆరవ రోజు:** జీరో ఎన్‌ఫోర్స్ మెంట్ డేగా నిర్వహించి, జరిమానాల బదులు కౌన్సిలింగ్ ద్వారా అవగాహన.

ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించి ప్రమాదాలను తగ్గించడం లక్ష్యమని సీపీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జాన్ నర్సింహులు, ఇన్స్‌పెక్టర్లు సీతారెడ్డి, సుజాత, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని సరుకులకు జెండా పాట అమలు చేయాలి

ప్రభాతగమనం, వరంగల్ బ్యూరో: రైతుల సరుకుల విక్రయంలో జెండా పాట విధానాన్ని అన్ని సరుకులకు అమలు చేసి దోపిడీని అరికట్టాలని, మిర్చికి క్వింటాకు ₹25వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించిన ప్రతినిధి బృందం రైతుల సమస్యలను తెలుసుకుని అధికారులకు మెమోరాండం సమర్పించింది. మిర్చికి సరైన ధరలు లభించక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



## మానవత్వం చాటిన కిష్టాపురం సర్పంచ్

- నిరుపేద కుటుంబానికి అండగా గంగావత్ రాంసింగ్

గార్ల, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే నిజమైన తృప్తి ఉందని పెద్ద కిష్టాపురం సర్పంచ్ గంగావత్ రాంసింగ్ నిరూపించారు. గార్ల మండలంలోని పుట్టకోట బజార్‌కు చెందిన నిరుపేద వ్యక్తి బందారు శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల సంభవించిన గాలి దుమారం కారణంగా శ్రీనివాస్ ఇంటి పైకప్పు రేకులు దెబ్బతిని ఒకవైపుకు వాలిపోయాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటిని బాగు చేయించుకోలేక, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కుటుంబంతో పాటు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన అనారోగ్యానికి గురవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న సర్పంచ్ రాంసింగ్ వెంటనే శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం తన సొంత నిధుల నుంచి రూ.10,000 ఖర్చు చేసి, స్వయంగా పర్యవేక్షిస్తూ ఇంటి పైకప్పు మరమ్మతులను చేపట్టించారు. ఈ సందర్భంగా రాంసింగ్ మాట్లాడుతూ, "కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలవడం మన కనీస బాధ్యత. శ్రీనివాస్ పరిస్థితి చూసి బాధ కలిగింది. అందుకే నా వంతు సహాయంగా ఈ మరమ్మతులు చేయిస్తున్నాను" అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో కొమరాజు జగదీష్, నందిపాటి సాయి, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొని సర్పంచ్ కృషిని అభినందించారు. తన ఇల్లు మరమ్మతులు జరుగుతుండటంతో బందారు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- తాళ్లపూసపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

కేసముద్రం, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం): మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు తులసి మొగ్గ రాజశేఖర్ మాట్లాడుతూ, రైతులు విత్తనం వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చే వరకు తీవ్ర శ్రమ పడుతున్నారని, కానీ పండించిన పంటను అమ్ముకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, తగిన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాళ్లపూసపల్లి గ్రామంలో గతంలో కేసముద్రం సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేసిన కేంద్రంలోనే మక్కల కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకుని మద్దతు ధరకు మక్కలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు, రైతులు మండల బిక్షపతి, గౌండ్ల యాదగిరి, తులసి మొగ్గ వెంకన్న, పలాస్టి ఉపేందర్, కాలేరు గోపయ్య, పోతకం సుధాకర్, మహేందర్, భద్రయ్య, నరసమ్మ పాల్గొన్నారు.



## గంధంపల్లి-కొత్తపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు

- ప్రారంభించిన ఎస్పీ శబరీష్
- యువకులతో కలిసి హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ

బయ్యారం, ఏప్రిల్ 9 (ప్రభాత గమనం): గ్రామ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ లక్ష్యంగా గంధంపల్లి–కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ శబరీష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీసీ కెమెరాల ప్రారంభానంతరం ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ, నేటి కాలంలో సీసీ కెమెరాలు "మూడో కన్ను"లా పనిచేస్తాయని పేర్కొన్నారు. గ్రామంలో అనుమానాస్పద కదలికలను గుర్తించడంలో, చోరీలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామ భద్రత కోసం చొరవ తీసుకున్న సర్పంచ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రతి గ్రామం డిజిటల్ భద్రతను అమలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఎస్పీ స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే అవగాహనతో పాటు స్వయం క్రమశిక్షణ అవసరమని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి మరియు భద్రత విషయంలో ఎల్లప్పుడూ ముందుంటామని, ఎస్పీ సూచనల మేరకు గ్రామాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు, వాహనదారులు, గ్రామ ప్రముఖులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీ స్వయంగా ర్యాలీలో పాల్గొనడం గ్రామస్తుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374